శ్మశానవాటిక పనులపై విచారణ చేయాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని శ్మశానవాటిలో జరిగిన అభివృద్ధి పనులపై జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు విచారణ చేయాలని బీఎస్పీ పార్టీ సీనియర్‌ నాయకుడు సుంకు వినయ్‌ కుమార్‌, బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీశైలం డిమాండ్‌ చేశారు. సోమవారం వారు మాట్లాడుతూ పట్టణంలోని శ్మశానవాటిలో జరిగిన అభివృద్ధి పనులపై సమాచార హక్కు చట్టం కింద వివరాలు సేకరించామన్నారు. అధికారులు ఇప్పటివరకు సుమారు రూ.కోటి 90లక్షలతో అభివృద్ధి చేసినట్లు వివరాలు ఇచ్చామన్నారు. కానీ క్షేత్ర స్థాయిలో అభివృద్ధి కనిపించడం లేదని తెలిపారు. ఈ విషయంపై ప్రభుత్వం వెంటనే స్పందించి విచారణ చేయాలని డిమాండ్‌ చేశారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌

పటాన్‌చెరు టౌన్‌: సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్‌ మెట్టు కుమార్‌ యాదవ్‌ అన్నారు. సోమవారం జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి డివిజన్‌ పరిధిలోని పలు కాలనీల్లో నూతనంగా నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ రూ. 1.12 కోట్లతో ఆల్విన్‌ కాలనీ, జేపీ కాలనీ శిశు మందిర్‌ వద్ద జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం జేపీ కాలనీలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయం వెనకాల నిర్మిస్తున్న డ్రైయినేజీ పనులను పరిశీలించారు.

ఎల్లయ్య సేవలు మరువలేనివి



మాట్లాడుతున్న కార్పొరేటర్‌ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్‌ సీనియర్‌ కార్మిక నేత ఎల్లయ్య సేవలు మరువలేనివి కార్పొరేటర్‌ పుష్ప అన్నారు. సోమవారం బెల్‌ కాలనీలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎల్లయ్య సంతాప సభలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీహెచ్‌ఈఎల్‌ కార్మికుల సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి ఎనలేనిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మౌలిక సౌకర్యాల కల్పనే లక్ష్యం

ఓల్డ్‌ బోయిన్‌పల్లి: ప్రజలకు వంద శాతం మౌలిక సదుపాయలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నానని, వారికి సేవ చేయడంలోనే సంతృప్తి కలుగుతుందని కార్పొరేటర్‌ ముద్దం నర్సింహయాదవ్‌ తెలిపారు. ఓల్డ్‌ బోయిన్‌పల్లి డివిజన్‌లోని గంగపుత్ర సంఘం కాలనీలో రూ.12 లక్షలతో వేస్తున్న సీసీ రోడ్డు పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించడంలో వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని అన్నారు. తాను చేస్తున్న అభివృద్ధికి ప్రజల సహకారం ఎంతో అవసరమని, అది ప్రజల నుంచి వస్తుండటంతోనే మరింత అభివృద్ధి సాధ్యమన్నారు. ఏఈ ఆశా, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ శ్రీకాంత్‌, నాయకులు ఇర్ఫాన్‌, కార్యదర్శి మేకల హరినాథ్‌, కర్రె జంగయ్య, గడ్డం నర్సింగ్‌రావు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఉన్న కరెంటు స్తంభాలను మార్చాలి

మోతీనగర్‌: కూకట్‌పల్లి నియోజకవర్గం అల్లాపూర్‌ డివిజన్‌ పరిధిలోని శివాజీనగర్‌లో శిథిలావస్థలో ఉన్న హైమాస్ట్‌ విద్యుత్‌ స్తంభం సమస్యను కార్పొరేటర్‌ సబిహాబేగం సోమవారం పరిష్కరించారు. కరెంటు స్తంభం ప్రమాదకరంగా మారిందని స్థానికులు ఆమెకు వివరించారు. స్పందించిన ఆమె వెంటనే జీహెచ్‌ఎంసీ అధికారులకు సమస్యను వివరించారు. కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పలు బస్తీల్లో ప్రమాదకరంగా స్తంభాలు ఉంటే వెంటనే మార్చాలని సూచించారు.

పంచశీల స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవం

మూసాపేట: మూసాపేటలోని పంచశీల ఉన్నత పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయ దినోత్సవం, ప్రపంచ అక్షరాస్యత దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయుల పాదాలు కడిగి ఆశీర్వాదం తీసుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్‌ పంచశీల శ్రీనివాస్‌ మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. ప్రయాణం సాగేదెలా..?

మార్తాండనగర్‌లో మురుగుమయంగా రోడ్డు

- ఇబ్బందులు పడుతున్న పాదచారులు, వాహనదారులు
- ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు



రోడ్డంతా బురద, చెత్తాచెదారంతో ఇబ్బంది పడుతున్న వాహనదారులు

చందానగర్‌: కొండాపూర్‌ డివిజన్‌ పరిధిలోని మార్తాండనగర్‌ బస్తీలోని రోడ్డుపై మట్టి, చెత్త, బండ రాళ్లు వేయడంతో గుంతలు ఏర్పడ్డాయి. చుట్టు పక్కల పలు బస్తీ వాసులు రాత్రి సమయాల్లో ఇష్టానుసారంగా చెత్తాచెదారాన్ని తీసుకువచ్చి రోడ్డుపై వేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరో పక్క నాలా విస్తరణ చేశారు. కానీ రోడ్డు వేయడం లేదని ఇంజినీరింగ్‌ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదంటూ బస్తీవాసులు ఆరోపిస్తున్నారు. ఆ రోడ్డు మీద నుంచి వెళ్లాలంటే సాహసం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోడ్డుపై వాహనదారులు, పాదచారులు నడవాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెత్తతో దోమల బెడద వల్ల విష జ్వరాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా రోడ్డు నిర్మాణ పనులకు ప్రత్యేక నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించాలని కోరుతున్నారు.

- మార్తాండనగర్‌ బస్తీలోని అంతర్గత రోడ్లు మాత్రం సీసీ రోడ్డు వేశారు. ప్రధాన రోడ్డు వేయడం మరిచారు. వెంటనే సీసీ రోడ్డు వేయాలి
- రోడ్డుపై మట్టి, చెత్త కుప్పలతో దుర్గంధంగా మారడంతో స్థానికుల సమస్యలు వర్ణాతీతం.
- రోడ్లపై పేరుకుపోతున్న చెత్తాచెదారంతో దోమల బెడద ఎక్కువతుందని దీంతో విష జ్వరాలు వస్తున్నాయి. ఎంటమాలజీ సిబ్బంది రోడ్లపై బ్లీచింగ్‌ పౌడర్‌ పిచికారీ చేయాలి.
- వీధిదీపాలు లేకపోవడంతో రాత్రి సమయాల్లో ఇబ్బందులు పడుతున్నారు.
- మార్తాండనగర్‌ నుంచి ప్రధాన రోడ్డుకు కలిసే ఈ రోడ్డు అభివృద్ధి చేయాలి.
- పారిశుద్ధ్య కార్మికులు ప్రతి రోజు చెత్తాచెదారం తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలి.
- బస్తీలలోని ప్రధాన చౌరస్తాలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి.
- రాత్రి సమయాల్లో రోడ్డుపై వెళ్లాలంటే ఇబ్బందులు పడకుండా వీధిదీపాలు ఏర్పాటు చేయాలి.



గుంతల రోడ్డుకు శాశ్వత పరిష్కారం చూపాలి..



మార్తాండనగర్‌ బస్తీలలోని అంతర్గత రోడ్లు సీసీ రోడ్లు వేశారు. కానీ ప్రధాన రోడ్డు వేయడం మరిచారు. సీసీ రోడ్డు వేయాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా గుంతల రోడ్డుకు శాశ్వత పరిష్కారం చూపాలి.

- ఇష్తికార్‌ అహ్మద్‌, మార్తాండనగర్‌



మార్తాండనగర్‌ బస్తీ ప్రధాన రోడ్డుపై పేరుకుపోయిన చెత్త కుప్పలు

ప్రతి రోజు చెత్త కుప్పలను తొలగించాలి..



మార్తాండనగర్‌ బస్తీ చుట్టు పక్కల బస్తీలోని ప్రజలు చెత్తాచెదారం తీసుకు వచ్చి రాత్రి సమయాల్లో రోడ్డుపై వేస్తున్నారు. నెలలు గడుస్తున్నా పారిశుద్ధ్య కార్మికులు చెత్తను తొలగించడం లేదు. పారిశుద్ధ్య అధికారులు ప్రతిరోజూ చెత్తను తొలగించాలి.

-సలీం, మార్తాండనగర్‌

ఆలయాల్లో సంప్రోక్షణలు..ప్రత్యేక పూజలు

రాయదుర్గం: సంపూర్ణ చంద్రగ్రహణంతో మూత పడిన ఆలయాలన్నీ సోమవారం ఉదయం నుంచే అన్ని ఆలయాల్లో సంప్రోక్షణ కార్యక్రమాలను అర్చకులు, నిర్వాహకులు కలిసి నిర్వహించారు. గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రం, జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయం, టెలికామ్‌నగర్‌ సాయిదత్తగణపతి ఆలయం, అంతేకాకుండా రాయదుర్గం, మధురానగర్‌, గౌలిదొడ్డి, నానక్‌రాంగూడ, గోపన్‌పల్లి, గోపన్‌పల్లి తాండ, ఎన్టీఆర్‌కాలనీ, ఇందిరానగర్‌, సాయిఐశ్వర్య, సాయివైభవ్‌కాలనీల్లోని వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో..

మియాపూర్‌: మయూరినగర్‌ కాలనీలోని కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే స్వామివారికి మహాసంప్రోక్షణ అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా పలు రకాల పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు. కాలనీలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి అభిషేకం చేశారు.



గణేషుడికి ప్రత్యేక అలంకారం



కాశీ విశ్వేశ్వరునికి ప్రత్యేక పూజలు

హెచ్‌సీయూలో క్విజ్‌ పోటీలు



క్విజ్‌ పోటీలను నిర్వహిస్తున్న ఆజాద్‌-నెహ్రూ స్టడీ ఫోరమ్‌

రాయదుర్గం: హెచ్‌సీయూలో విద్యార్థులకు క్విజ్‌ పోటీలను నిర్వహించారు. ఆజాద్‌-నెహ్రూ స్టడీ ఫోరమ్‌ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని వివేకానంద స్టూడెంట్స్‌ అమినిటీస్‌ సెంటర్‌ ముందున్న లాన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహక ప్రతినిధి సునీల్‌ మాట్లాడుతూ.. జాతీయ, అంతర్జాతీయ అంశాలకు సంబంధించిన ప్రశ్నల ద్వారా క్విజ్‌ పోటీలను కొనసాగాయన్నారు. ఈ పోటీలకు క్విజ్‌ మాస్టర్‌గా ప్రణవ్‌ వ్యవహరించారన్నారు. ఈ క్విజ్‌ పోటీల్లో మొత్తం 20 టీమ్‌లు పాల్గొన్నాయని, ఒక్కో టీమ్‌లో ముగ్గురు విద్యార్థులకు అవకాశం కల్పించినట్లు ఆయన వివరించారు. ప్రతి యేటా ఆజాద్‌-నెహ్రూ స్టడీ ఫోరమ్‌ ఆధ్వర్యంలో క్విజ్‌ పోటీలను ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ ఏడాది కూడా నిర్వహించగా పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఈ పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఫోరమ్‌ ప్రతినిధులు భీమ్‌, అంకిత్‌, శామ్యూల్‌, హమ్నా, అద్వైత్‌, మాంగ్‌పి, సిద్ధార్థ్‌, విద్యార్థులు పాల్గొన్నారు

అక్షరాస్యతను పెంపొందించాలి

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ శ్రీనివాస్‌

పటాన్‌చెరు టౌన్‌: నిరక్షరాస్యులైన వారికి అక్షరాస్యతను పెంపొందించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ వడ్లూరి శ్రీనివాస్‌ విద్యార్థులకు సూచించారు. సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్‌ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదవడతోపాటు రాయడంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా డిజిటల్‌ అక్షరాస్యతపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం అధికారి డాక్టర్‌ వెంకటేశం, డాక్టర్‌ కరుణ కుమారి, ఆర్ట్స్‌ విభాగం అధ్యాపకులు డాక్టర్‌ సుజాత, డాక్టర్‌ మంజు, ఖాసీం, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ శ్రీనివాస్‌

విదేశాల్లో ఉన్నత విద్యావకాశాలపై అవగాహన అవసరం

మణికొండ: విదేశాల్లో ఉన్నత విద్య చదివితే మరింత మంచి ఉద్యోగావకాశాలు వస్తున్నాయని, ఉత్సాహం ఉన్న విద్యార్థులు వాటిపై అవగాహన పెంచుకుని సద్వినియోగం చేసుకోవాలని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ (ఎంజీఐటీ) ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ జీ.చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం గండిపేటలోని కళాశాలలో గ్లోబల్‌ ఎడ్యుకేషన్‌, కెరీర్స్‌ ఫోరం, కెరీర్‌ గైడెన్స్‌ సెల్‌ల సంయుక్త ఆధ్వర్యంలో వన్‌ డే క్యాంపస్‌ స్టడీ అబ్రాడ్‌ ఫెయిర్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విదేశా ల్లో ఉన్నత విద్యావకాశాలు, ప్రవేశ ప్రక్రియ, స్కాలర్‌షిప్‌లు, విద్యా రుణాలు, వీసా సమాచారాలను విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, జర్మనీ, ఫ్రాన్స్‌ వంటి దేశాలకు చెందిన ప్రముఖ విశ్వవిద్యాలయాల ప్రతినిధులు పాల్గొన్నారు. విద్యార్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. వైస్‌ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ కె.సుధాకర్‌రెడ్డి, కెరీర్‌ గైడెన్స్‌ సెల్‌ అధిపతి డాక్టర్‌ సి.ఎస్‌.శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

విధులపై ఏఎంవీఐలకు అవగాహన

మణికొండ: సరైన అనుమతులు, పత్రాలు లేని వాహనాలను ఎప్పటికప్పుడు అరికడితేనే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని సీనియర్‌ మోటార్‌ వెహికిల్‌ ఇన్‌స్పెక్టర్‌ కిరణ్‌కుమార్‌ రెడ్డి, ఎంవీఐ నవీన్‌ పేర్కొన్నారు. మణికొండలోని జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో ఇటీవల కొత్తగా చేరిన 22 మంది సహాయ మోటార్‌ వెహికిల్‌ ఇన్‌స్పెక్టర్‌లకు సోమవారం ఆయన మోటారు వాహన చట్టం, వాహనాలపై నమోదు చేసే కేసులపై అవగాహన కల్పించారు. రవాణా శాఖ కార్యాలయంలో జారీ చేసే లైసెన్సులు, వాహన బదిలీ, కొత్త వాహనాల రిజిస్ట్రేషన్‌లు, నెంబర్‌ ప్లేట్‌ల జారీ తదితర విషయాలపైనా అవగాహన పెంచుకోవాలన్నారు. ఆరు నెలల పాటు చట్టం గురించి తెలుసుకున్న వారు విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లపై అవగాహన ఉండాలన్నారు. ఈ శిక్షణ 20 రోజుల పాటు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సహాయ ఎంవీఐలు పాల్గొన్నారు.

నవసమాజ స్థాపకులు ఉపాధ్యాయులు

మణికొండ: మనకు విద్యాబుద్ధులు నేర్పించి, జీవితంలో ఉన్నతంగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులను ప్రతి ఒక్కరూ గౌరవించుకోవాలని మణికొండ మున్సిపల్‌ మాజీ వైస్‌ చైర్మన్‌ కె.నరేందర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్‌ కె.రామకృష్ణారెడ్డి అన్నారు. మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సమాజాన్ని ఉత్తమంగా తయారు చేయటంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదన్నారు. మణికొండ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను అన్ని రంగాలలో తీర్చిదిద్దాలన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌ ఎ.కుమార్‌, బీజేపీ మున్సిపల్‌ అధ్యక్షుడు బి.రవికాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శివరామిరెడ్డి, నాయకులు జె.సిద్ధప్ప, బి.శ్రీరాములు, శ్రావణ్‌కుమార్‌, శివగంగ, రాజేశ్‌, గంగాధర్‌, ప్రధానోపాధ్యాయుడు నిరంజన్‌, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒక్కరోజు తీర్థ యాత్రకు సూపర్‌ లగ్జరీ బస్సు

మియాపూర్‌: మియాపూర్‌-1 డిపో పరిధిలో ఒక్కరోజు తీర్థయాత్ర నిమిత్తం ఈ నెల 13న శనివారం సూపర్‌ లగ్జరీ బస్సు నడుపుతున్నట్లు మియాపూర్‌-1 డిపో మేనేజర్‌ మోహన్‌ రావు ఓ ప్రకటనలో తెలిపారు. మహానంది, అహోబిళం (లక్ష్మీనరసింహ స్వామి ఆలయం), జోగులాంబ (శక్తిపీఠం), బీచుపల్లి (హనుమాన్‌ ఆలయం) దర్శించుకునేందుకు సూపర్‌ లగ్జరీ బస్సు నడుపుతున్నట్లు తెలిపారు. శనివారం రాత్రి 8 గంటలకు మియాపూర్‌ నుంచి బస్సు బయల్దేరి ఆదివారం ఉదయం 5 గంటలకు మహానందికి చేరుకుంటుందని తెలిపారు. అదేవిధంగా ఆదివారం రాత్రి 11 గంటల వరకు మియాపూర్‌కు తిరిగి చేరుకుంటుందన్నారు. మిగితా వివరాల కోసం 8500309052, 7659029882 లలో సంప్రదించాలని తెలిపారు.

తెలంగాణలో సందర్శన..

మియాపూర్‌-1 డిపో పరిధిలో స్పెషల్‌ టూర్‌ ప్యాకేజీతో ప్రతి ఆదివారం సూపర్‌ లగ్జరీ బస్సు నడుపుతున్నట్లు డిపో మేనేజర్‌ మోహన్‌ రావు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి ఆదివారం తెలంగాణలోని ప్రసిద్ధ గణేష్‌ గడ్డ వినాయక ఆలయం, బీదర్‌లోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం, రేజింతల్‌ వరసిద్ధి వినాయక ఆలయం, జరా సంఘం కేతకి సంగమేశ్వర ఆలయం, చిటకుల్‌ చాముండేశ్వరి ఆలయం, ఏడుపాయల వనదుర్గమాత ఆలయం దర్శన నిమిత్తం సూపర్‌ లగ్జరీ బస్సు నడుపుతున్నట్లు తెలిపారు. మియాపూర్‌ నుంచి ప్రతి ఆదివారం ఉదయం 4 గంటలకు బయల్దేరి దర్శనానంతరం రాత్రి 11 గంటలకు మియాపూర్‌కు చేరుకుటుందని తెలిపారు. 30 మంది కంటే ఎక్కువగా భక్తులు ఉన్నచో ఏరోజైనా బస్సును నడపడం జరుగుతుందని తెలిపారు. మరిన్నీ వివరాల కోసం 98486 70640, 99592 26153 లలో సంప్రదించాలని తెలిపారు.

ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ



డీసీ శశిరేఖకు వినతిపత్రం అందజేస్తున్న రఘునాథ్‌రెడ్డి

చందానగర్‌: చందానగర్‌ సర్కిల్‌ 21 కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకమిషనర్‌ శశిరేఖ సర్కిల్‌ పరిధిలో నెలకొన్న సమస్యలపై ప్రజల నుంచి అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి 16 ఫిర్యాదులు వచ్చాయని వాటిలో టౌన్‌ ప్లానింగ్‌-09, రెవెన్యూ 01, ఇంజినీరింగ్‌-04, ఇతర సెక్షన్‌లకు-02 ఫిర్యాదులు వచ్చాయన్నారు. వెంటనే ఫిర్యాదులను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మణికరణ్‌, ఏసీపీ నాగిరెడ్డి, ఇంజనీరింగ్‌ డీఈ దుర్గప్రసాద్‌, ఎంటమాలజీ, యూబీడీ అధికారులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కనీస వసతులు ఏర్పాటు చేయాలని..

చందానగర్‌, హఫీజ్‌పేట్‌ డివిజన్ల పరిధిలో బతుకమ్మకుంట, ఈర్ల చెరువు వద్ద బతుకమ్మల నిమజ్జనం కోసం కనీస వసతులు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్‌ పార్టీ సీనియర్‌ నాయకులు రఘునాథ్‌రెడ్డి, బీజేపీ నాయకులు బోయిని మహేష్‌ యాదవ్‌ డీసీకి వినతిపత్రాలు అందజేశారు. అదే విధంగా హఫీజ్‌పేట్‌ డివిజన్‌లో పారిశుద్ధ్యం, రోడ్లు, డ్రైనేజీ, నాలా విస్తరణ తదతర సమస్యలపై వివరించారు. చందానగర్‌లోని భవానీపురం వీకర్‌ సెక్షన్‌ ఇంటి నెంబర్లు కేటాయించాలని ఆమెను కోరారు.

శేరిలింగంపల్లి సర్కిల్‌లో మూడు ఫిర్యాదులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు మూడు ఫిర్యాదులు అందజేశారు. టౌన్‌ప్లానింగ్‌ విభాగానికి 3 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో, ఏఎంసీలు ప్రేమ్‌కుమార్‌, శ్రవణ్‌కుమార్‌రెడ్డి, ప్రాజెక్టు ఆఫీసర్‌ మల్లీశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

రేగులకుంట చెరువును పరిరక్షించాలి

మియాపూర్‌: రేగులకుంట చెరువును పరిరక్షించాలని జనం కోసం అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి జోనల్‌ కమిషనర్‌కు, శేరిలింగంపల్లి మండల తహసీల్దార్‌, చందానగర్‌ సర్కిల్‌ ఉప కమిషనర్లకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ..హఫీజ్‌పేటలోని 150 సర్వే నంబర్‌లో ఉన్న రేగులకుంట చెరువు కబ్జాకు గురైందన్నారు. అభివృద్ధి పేరుతో చెరువు విస్తీర్ణాన్ని కుదించారన్నారు. రేగులకుంట చెరువును కొందరు ప్రైవేటు వ్యక్తులు కబ్జాచేసి అక్రమంగా అవినీతి పత్రాలను సృష్టించి జోనల్‌ కార్యాలయం నుంచి ఆ స్థలంలో భవన నిర్మాణానికి అనుమతులు పొందాలని తెలిపారు. పార్కులు, చెరువులు కబ్జాచేసిన స్థలాలకు కూడా కొందరు అధికారులు అనుమతులిస్తున్నారని, దీనిని నియంత్రించడంలో ఉన్నతాధికారులు విఫలం కావడం శోచనీయమన్నారు.



జెడ్సీకి వినతిపత్రం అందజేస్తున్న కసిరెడ్డి భాస్కర్‌ రెడ్డి

ఘనంగా అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న దృశ్యం

చందానగర్‌: అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని చందానగర్‌లోని న్యూ గుడ్‌ షెప్పర్డ్‌ చెవిటి, మూగ హైస్కూల్‌లో ఫ్రెండ్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఫ్రెండ్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ కన్వీనర్‌ తాడిబోయిన రామస్వామి యాదవ్‌ హాజరై విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్‌, పండ్లు, బిస్కెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మానవుని సర్వతోముఖాభివృద్ధి కేవలం విద్య తోటే సాధ్యమన్నారు. అక్షరాస్యత అనగా చదవడం, రాయడం, అర్థం చేసుకోవడం లాంటివన్నారు. వ్యక్తిగత సాధికారత, సామాజిక పురోగతికి మూలస్తంభం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మెర్సి, అధ్యాపకులు శోభ, అంజలి, ఫ్రెండ్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ సభ్యులు శివరామకృష్ణ, అమ్మయ్య చౌదరి, పాలం శ్రీను, విష్ణు ప్రసాద్‌ పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యకు తొలి ప్రాధాన్యం



ఎమ్మెల్యేతో కలిసి ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎస్పీ పరితోశ్‌

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి
- మాదక ద్రవ్యాల నిర్మూలనలో భాగస్వాములు కావాలి
- జిల్లా ఎస్పీ పరితోశ్‌ పంకజ్‌

పటాన్‌చెరు: ప్రభుత్వ విద్య వ్యవస్థను బలోపేతం చేయడమే తొలి ప్రాధాన్యంగా ముందుకు వెళ్తున్నామని ఎమ్మెల్లే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. పటాన్‌చెరు డివిజన్‌ పరిధిలో ప్రభుత్వ పాఠశాలల గురుపూజోత్సవ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ పరితోశ్‌ పంకజ్‌తో కలసి మహిపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్నారన్నారు. వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని చెప్పారు. కార్పొరేట్‌ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. జిల్లా ఎస్పీ పరితోశ్‌ పంకజ్‌ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల నిర్మూలనలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. మత్తుపదార్థాల వాడకం వల్ల కలిగే అనర్థాల గురించి ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని కోరా రు. అంతకుముందు నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న 100 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఎస్పీ ప్రభాకర్‌, రామచంద్రాపురం కార్పొరేటర్‌ పుష్ప, జెడ్పీ మాజీ వైస్‌ చైర్మన్‌ ప్రభాకర్‌, మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ విజయ్‌ కుమార్‌, మాజీ జెడ్పీటీసీలు తదితరులు పాల్గొన్నారు.